దేశవ్యాప్తంగా 150 దేవాలయాల అభివృద్ధి


అమ్మవారి చెంత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, భాజపా నాయకులు

రంగంపేట, న్యూస్‌టుడే: దేశవ్యాప్తంగా 150 దేవాలయాల్లో వివిధ అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. సోమవారం వరంగల్ నగర పర్యటనకు విచ్చేసిన కేంద్ర మంత్రి ఓరుగల్లు నగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీభద్రకాళి అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో అయోధ్య, వారణాసితో పాటు అనేక దేవాలయాలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. తెలంగాణలో జోగులాంబ, భద్రాచలం, రామప్ప, బల్కంపేట అమ్మవారి ఆలయాలు అభివృద్ధి పరుస్తున్నట్లు వివరించారు. ప్రతి పండగలో యువత భక్తిశ్రద్ధలతో పాల్గొంటున్నారని, ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో పాల్గొనడం వల్ల పెద్దల పట్ల గౌరవం, సంస్కృతి సంప్రదాయాలు తెలుస్తాయన్నారు. కేంద్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలిసారిగా శ్రీభద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నానని, కశ్మీర్ ఎన్నికల ఇన్‌ఛార్జి బాధ్యతలు ఉండటంతో కొంత ఆలస్యమైందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వివరించారు. ప్రధాని మోదీ కూడా అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారని చెప్పారు. కార్యక్రమంలో భాజపా వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకులు రావు పద్మ, గంట రవికుమార్, ఎం.ధర్మారావు, డా.విజయచందర్‌రెడ్డి, డా.కాళీప్రసాద్, కొండేటి శ్రీధర్, సత్యపాల్‌రెడ్డి, మాజీ ఎంపీ ఆచార్య సీతారాంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎంజీఎంలో జూనియర్ వైద్యుల సమ్మె

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: కోల్‌కతాలో యువ వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యానికి నిరసనగా అక్కడి వైద్యులు చేపట్టిన దీక్షలకు మద్దతుగా మంగళవారం విధులు బహిష్కరించి సమ్మె చేయనున్నట్లు కాకతీయ వైద్యకళాశాల జూనియర్ డాక్టర్ల అసోసియేషన్(జూడా) ప్రకటించింది. ఎంజీఎం ఆసుపత్రిలోని గాంధీ విగ్రహం వద్ద ఉదయం 9గంటలకు దీక్షలు చేపడతామని జూడా కేఎంసీ బాధ్యుడు డా.నవదీప్ తెలిపారు.

ఈనాడు వరంగల్
మంగళవారం అక్టోబరు 15, 2024

కలాం మాట.. విజయ బావుటా!

నేడు ప్రపంచ విద్యార్థుల దినోత్సవం



పూరి గుడిసెలో.. దీప కాంతుల్లో.. చదువుకున్న ఆ వ్యక్తి ప్రపంచం గర్వించదగ్గ శాస్త్రవేత్త అవుతారని ఎవరూ ఊహించలేదు.. శాస్త్రసాంకేతిక రంగాల్లో అద్భుత విజయాలతో అభిమానం చూరగొని రాష్ట్రపతిగా అత్యున్నత పదవి అలంకరించారు. నిరంతర అధ్యయనం మహోన్నతుడిగా నిలిపింది. అంతేకాదు.. స్ఫూర్తి నింపేలా ప్రసంగాలు చేసి విద్యార్థులను ఆకట్టుకున్నారు. ఆయనే దివంగత మాజీ రాష్ట్రపతి డాక్టర్ అబ్దుల్ కలాం. నేడు ఆ మహనీయుడి జయంతి సందర్భంగా 'ప్రపంచ విద్యార్థుల దినోత్సవం' జరుపుకొంటున్నారు. ఈ నేపథ్యంలో యువతలో స్ఫూర్తినింపే కలాం మాటలు.. ఆ బాటలో సాగుతున్న వారి స్ఫూర్తిగాథలతో 'ఈనాడు' ప్రత్యేక కథనమిది..

—ఈనాడు, మహబూబాబాద్

'యువత ఉద్యోగార్థుల నుంచి ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలి'

పరి'శ్రమ' ఫలించి.. ఉపాధి కల్పిస్తూ..



బీటెక్ విద్య నభ్యసించే యువకులు ఎవరైనా మంచి ఉద్యోగం సాధించాలనే లక్ష్యంగా ముందుకెళ్తారు. కానీ, మహబూబాబాద్ పట్టణానికి చెందిన భూక్య యశ్వంత్‌నాయక్ బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నప్పుడే వ్యాపారవేత్త కావాలని, కొంతమందికి ఉపాధి కల్పించాలని ఆలోచించారు. 2021లో రూ.35 లక్షలతో జూట్ సంచుల తయారీ పరిశ్రమ నెలకొల్పారు. ఎన్ని సమస్యలు వచ్చినా పట్టుదలతో ముందుకెళ్లి.. నేడు 20 మందికి ఉపాధి కల్పిస్తున్నారు.

'విజయం సాధించాలనే సంకల్పం, తగినంత బలం ఉంటే.. వైఫల్యం నన్ను ఎప్పటికీ అధిగమించదు'..

యావత్ దేశం గర్వించేలా..



ఓరుగల్లు యువకుడు ఇరిగేశి అర్జున్ చదరంగంలో ప్రపంచ చెస్ ఒలింపియాడ్ టైటిల్ కైవసం చేసుకొని యావత్ దేశం గర్వించేలా చేశారు.. 2018లో తెలంగాణ నుంచి గ్రాండ్‌మాస్టర్, 2022లో సూపర్ గ్రాండ్‌మాస్టర్ హోదా సాధించిన మొదటి వ్యక్తిగా చరిత్ర సృష్టించారు. 21 ఏళ్ల యువ క్రీడాకారుడు అపజయాలకు కుంగిపోకుండా ప్రత్యర్థుల ఎత్తులను చిత్తు చేస్తున్నారు.

'చిన్న లక్ష్యం నేరం.. లక్ష్యం గొప్పదై ఉండాలి'

అయిదు ఉద్యోగాలు సాధించి..



పలువురికి స్ఫూర్తిగా నిలిచేలా గొప్ప లక్ష్య శిఖరాన్ని ఛేదించేవారు ఎందరో.. అలాంటి వారిలో వరంగల్ జిల్లా నల్లబెల్లి మండల కేంద్రానికి చెందిన వడ్లూరి రమ, ఉపాధ్యాయుడు విష్ణు దంపతుల కుమార్తె శ్వేత ఒకరు. ఈ-సెట్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచి ఎంఈ పూర్తి చేశారు. పోటీ పరీక్షలు రాసి ఐదింటిలో ఉద్యోగాలు సాధించారు. ప్రస్తుతం ఆర్అండ్‌బీ శాఖ కరీంనగర్ సబ్ డివిజన్‌లో ఏఈఈగా పనిచేస్తున్నా.. త్వరలోనే పాలిటెక్నిక్ లెక్చరర్‌గా ఉద్యోగంలో చేరి ఎంతో మంది విద్యార్థులను ఆవిష్కర్తలుగా తీర్చుదిద్దుతానని చెప్పారు.

ఈ ఏడాది అంశం

'విద్యార్థులు చదువు, భవిష్యత్తును తీర్చిదిద్దుకునేలా బాధ్యత ఇద్దాం.. వారిలో శక్తిసామర్థ్యాలను వెలికితీసి నాయకులుగా, ఆవిష్కర్తలుగా ఎదిగేలా ప్రోత్సహిద్దాం..

"జీవితంలో కష్టాలను ఎదుర్కొన్నప్పుడే విజయాలను ఆస్వాదించగలం"

వైకల్యాన్ని ఎదిరించి..



వరంగల్ జిల్లా కల్లెడకు చెందిన జీవాంజి దీప్తి పారాలింపిక్స్ కాంస్య పతక విజేత.. తనది నిరుపేద కుటుంబం.. పుట్టుకతోనే మానసిక వైకల్యం.. జీవితంలో ఎన్నో కష్టాలు ఎదురవుతున్నా.. తల్లిదండ్రుల ప్రోత్సాహం, వ్యాయామ ఉపాధ్యాయులు, అథ్లెటిక్స్ కోచ్ శిక్షణలో విజేతగా నిలిచారు. లక్ష్యసాధనలో అడ్డంకులను పరుగుతో ఛేదించారు. అంకితభావంతో డిగ్రీ పూర్తి చేసి ఈ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారిణి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలుస్తున్నారు.

'సైన్స్ అనేది మానవాళికి ఒక అందమైన బహుమతి.. మనం దాన్ని వక్రీకరించకూడదు'

ఆవిష్కరణలు అదుర్స్



మహబూబాబాద్ మండలం కంబాలపల్లికి చెందిన షణ్ముఖరావు చదువుకున్నది పదో తరగతే.. కానీ, గొప్ప ఆవిష్కర్త.. పత్తి, మిర్చిలో కలుపు మొక్కలను తొలగించడానికి యంత్రాన్ని తయారు చేయాలనే ఆలోచనతో 2019లో 'మోనోవీల్ మ్యాన్‌రైడింగ్ పవర్ వీడర్'ను తయారు చేశారు. అంతర్జాతీయ స్థాయిలో బంగారు పతకం పొందారు. ఇప్పటివరకు ప్రజలకు ఉపయోగపడే ఎనిమిది రకాల ఆవిష్కరణలు తయారు చేశారు.

'కల అంటే మీరు నిద్రపోతున్నప్పుడే చూసేది కాదు.. అది మిమ్మల్ని నిద్రపోనివ్వదు'

పేదరికం అడ్డుకాలేదు



పాఠశాల స్థాయిలో గురువు మొగిలి స్ఫూర్తితో తానూ ఉపాధ్యాయ వృత్తిలోకి రావాలని.. కలలు గని పట్టుదలతో చదివి ఉపాధ్యాయురాలిగా విధుల్లో చేరబోతున్నారు.. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం ఉప్పరపల్లికి చెందిన పల్లకొండ శిల్ప.. నిరుపేద కుటుంబానికి చెందిన రవి, భాగ్యల కూతురు.. ఊరిలో సొంతిల్లు కూడా లేదు. చదువుకు పేదరికం అడ్డుకాదని, ప్రభుత్వ బడుల్లో చదువుకుని గురువు సూచనలతో ఇంటర్ తర్వాత టీటీసీ చదివి ఇప్పుడు ప్రభుత్వ ఉపాధ్యాయురాలైంది.

ఉమ్మడి జిల్లాలోని విద్యార్థుల వివరాలు	
పాఠశాలల విద్యార్థులు	4,63,500
జూనియర్ కళాశాలల్లో	1,03,100
డిగ్రీ, ఇంజినీరింగ్, ఫార్మసీలో	1,19,000
పీజీ విద్యార్థులు	11,600

పనుల పరిశీలన.. అధికారులకు సూచనలు


అధికారులతో మాట్లాడుతున్న వీపీ గౌతమ్

కార్పొరేషన్, న్యూస్‌టుడే: స్మార్ట్‌సిటీ పథకం నిధులతో అభివృద్ధి చేసిన ఆధునిక సేవలు వీలైనంత త్వరగా అందుబాటులోకి తేవాలని రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు(సీడీఎంఏ) వీపీ గౌతమ్ అధికారులను ఆదేశించారు. బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ) పనితీరును పరిశీలించారు. సోమవారం ఉదయం గ్రేటర్ వరంగల్ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ డా. అశ్విని తానాజీతో కలిసి అభివృద్ధి పనులు పరిశీలించారు. ఐసీసీసీ, వరంగల్ పోతన మందిరంలో చెత్త రవాణా కేంద్రం, పోతననగర్‌లో ఆధునిక దోబీఘాట్‌తో పాటు రెండుగంటల పాటు వివిధ పనులపై సీడీఎంఏ తనిఖీలు నిర్వహించారు. అధికారులు, ఉద్యోగులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వరంగల్ ఆర్డీ షాహిద్ మసూద్, అదనపు కమిషనర్ రాజేందర్ రెడ్డి, ఎస్ఈలు రాజయ్య, ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో డా.రాజిరెడ్డి, ఉప కమిషనర్లు కృష్ణారెడ్డి, రవీందర్, ప్రసన్నరాణి తదితరులు పాల్గొన్నారు.

పర్యటన సాగింది ఇలా..

☛ బల్దియా ప్రధాన కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్(ఐసీసీసీ)పై పలు సూచనలు చేశారు. ట్రాఫిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిస్టమ్ తయారీ పోలీసు శాఖకు అప్పగించాలని, అవసరమైతే లింకు పంపించాలని సీడీఎంఏ గౌతమ్ కోరారు. ఘన వ్యర్థాల నిర్వహణ(సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్), చెత్తను తరలించే వాహనాల పర్యవేక్షణను ఐసీసీసీకి అనుసంధానం చేయాలన్నారు.

☛ వరంగల్ పోతన మందిరంలో ఆధునిక చెత్త రవాణా కేంద్రాన్ని సీడీఎంఏ, మేయర్, కమిషనర్ పరిశీలించారు. స్వచ్ఛ ఆటో డ్రైవర్‌తో మాట్లాడారు. రోజూ ఎంత చెత్త సేకరణ జరుగుతుందని అడిగారు. చెత్తను తరలించే వాహనాలపై కవర్లు కప్పాలని సూచించారు.

☛ వరంగల్ పోతననగర్‌లో ఆధునిక దోబీఘాట్ వెంటనే అందుబాటులోకి తేవాలని, ఏడాది నుంచి ఏం చేస్తున్నారని అధికారులను సీడీఎంఏ ప్రశ్నించారు. రజక సంఘాలు, రజక మహిళా స్వయం సహాయక సంఘాల లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు.

బాతులతో ఉపాధి 'బాట'



ఒకేచోట వేల సంఖ్యలో ఉన్న బాతుపిల్లలను చూసేందుకు రెండు కళ్లు సరిపోవు. పొట్టకూటి కోసం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరు జిల్లా నుంచి ఓ కుటుంబం బాతు పిల్లల పెంపకం కోసం ఖిలావరంగల్‌కు వచ్చారు. ఓ చోట స్థావరం ఏర్పాటు చేసుకొని బాతు పిల్లలను పెంచుతున్నారు. ఒక్కో బాతుపిల్లను రూ.35కు కొనుగోలు చేసి నాలుగు నెలలపాటు పెంచుతామన్నారు. ఆ తర్వాత కిలో రూ.200 చొప్పున మాంసాహారానికి, బాతు గుడ్ల కోసం వాటిని విక్రయిస్తామని వారు చెప్పారు.

– న్యూస్‌టుడే, గిర్మాజీపేట

కాంగ్రెస్ అధిష్ఠానం ఆరా..!

రంగంపేట, న్యూస్‌టుడే: 'ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో ఏం జరుగుతోంది?, గీసుకొండ మండలం ధర్మారంలో ఫ్లెక్సీ వివాదం ఏమిటి?, మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గాల మధ్య గొడవలు ఎందుకు? ఇద్దరి మధ్య దూరం పెరగడానికి కారణాలేమిటి?' తదితర అంశాలపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆరా తీసింది. సోమవారం నిఘా వర్గాల ద్వారా సమగ్ర నివేదిక సీఎం రేవంత్‌రెడ్డి వద్దకు చేరింది. టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ మంత్రి సురేఖ, ఎమ్మెల్యే రేవూరితో చరవాణిలో మాట్లాడినట్లు తెలిసింది. తొందరపడి ఎలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఇద్దరికి సూచించినట్లు సమాచారం. వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, 'కుడా' ఛైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి సోమవారం ఉదయం ధర్మారం వెళ్లేందుకు సిద్ధం కాగా, పోలీసు అధికారుల సూచనతో విరమించుకున్నారు.

రేవూరి వర్గీయుడిపై కేసు నమోదు

గీసుకొండ, న్యూస్‌టుడే: గీసుకొండ మండలం ధర్మారంలో దసరా పండగ సందర్భంగా మంత్రి కొండా సురేఖ వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపివేసిన ఘటనలో ఇదే గ్రామానికి చెందిన ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వర్గీయుడైన పిట్టల అనిల్‌పై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు. రేవూరి వర్గీయులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను చింపివేయడమే కాక పిట్టల అనిల్‌పై దాడి చేసినందుకు కొండా వర్గానికి చెందిన ఎనిమిది మందిపై ఆదివారం పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. తన వర్గానికి చెందిన కార్యకర్తలు ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదంటూ మంత్రి సురేఖ పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే. పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఆదేశాలతో కొండా వర్గానికి చెందిన మెట్టు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు రేవూరి వర్గీయుడైన పిట్టల అనిల్‌పై ఆదివారం రాత్రి పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఫ్లెక్సీల వివాదంలో ఇరు వర్గాలకు చెందిన వారిపై పోలీసులు కేసులు నమోదు చేసినట్లైంది.


గాయపడిన పిట్టల అనిల్‌ను పరామర్శిస్తున్న వరంగల్ డీసీసీ అధ్యక్షురాలు స్వర్ణ, 'కుడా' ఛైర్మన్ వెంకట్రామిరెడ్డి

ధర్మారంలో నెలకొన్న ప్రశాంతత

గీసుకొండ: గీసుకొండ మండలం ధర్మారంలో సోమవారం ప్రశాంత వాతావరణం నెలకొంది. మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే రేవూరి వర్గీయుల మధ్య గొడవల కారణంగా ఆదివారం గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సోమవారం డీసీపీ రవీందర్, మామునూరు ఏసీపీ తిరుపతి, గీసుకొండ, పర్వతగిరి సీఐలు మహేందర్, రాజగోపాల్, గీసుకొండ, ఎనుమాముల ఎస్సైలు కుమార్, శ్రీకాంత్‌ల ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

హనుమకొండ నుంచే ఓరుగల్లు పాలన

కొనసా...గుతున్న కలెక్టరేట్ పనులు.. ప్రజలకు ఇబ్బందులు


అసంపూర్తిగా భవన నిర్మాణాలు

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే

రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన చిన్న చిన్న జిల్లాలకు సైతం సమీకృత కలెక్టరేట్ భవనాలు ఉన్నాయి. అన్నిశాఖలు ఒకే దగ్గర ఉండటంతో ప్రజలకు సేవలు చేరువయ్యాయి. కానీ! చారిత్రక ప్రాధాన్యం కలిగిన ఓరుగల్లు జిల్లాలో కలెక్టరేట్ భవన నిర్మాణ పనులు ఇంకా పూర్తి కాలేదు. వరంగల్- హనుమకొండ జిల్లాలు వేరైనా.. ఓరుగల్లు జిల్లా పరిపాలన మొత్తం హనుమకొండ జిల్లా కేంద్రం నుంచే నిర్వహించాల్సి వస్తోంది. జిల్లా కలెక్టరేట్‌తో పాటు 70శాతానికి పైగా ప్రభుత్వ కార్యాలయాలు హనుమకొండ జిల్లా పరిధిలోనే కొనసాగుతున్నాయి. వివిధ సమస్యల పరిష్కారం కోసం జిల్లా ప్రజలు.. సంబంధిత అధికారులను సంప్రదించాలనుకున్నా.. వారి కార్యాలయం ఎక్కడుందో తెలియని పరిస్థితి.

జిల్లాలో సమీకృత కార్యాలయాల సముదాయం(ఐడీవోసీ) భవన నిర్మాణాలు గతేడాది జూన్ 17న మొదలయ్యాయి. అజంజాహీ మైదానంలో కేటాయించిన 18 ఎకరాల స్థలంలో అప్పటి మంత్రి కేటీఆర్ భూమిపూజ చేసి పనులకు శంకుస్థాపన చేశారు. గత ప్రభుత్వం రూ.80 కోట్లు మంజూరు చేయగా.. గౌరీశంకర్ ఇన్‌ఫ్రాకు టెండర్ దక్కింది. అయితే శాసనసభ, పార్లమెంటు ఎన్నికలకు తోడు.. భవన నిర్మాణాల్లో గుత్తేదారు నిర్లక్ష్యం, అధికారుల పర్యవేక్షణలోపం కారణంగా కలెక్టరేట్ పనులు ఇంకా పూర్తి కాలేదు.

మరో మూడు నెలల్లో పూర్తయ్యేనా?

వరంగల్ ఐడీవోసీ నిర్మాణం కోసం ఆర్అండ్‌బీ ఇంజినీర్లు జీ+2తో డిజైన్ చేశారు. ఏ, బీ, సీ, డీ మొత్తం నాలుగు బ్లాకులుగా నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇందులో ఏ, బీ, సీ బ్లాకు పిల్లర్లు పూర్తయి స్లాబుల దశలో ఉండగా.. డీ బ్లాక్ ఇంకా పిల్లర్ల దశలో ఉంది. పిల్లర్ల ఏర్పాటు పూర్తయిన తర్వాత గోడల నిర్మాణం, ప్లాస్టింగ్, ప్లంబింగ్, విద్యుత్తు, పెయింటింగ్ ఇతర పనులకు మరో ఏడాదికాలం పట్టే అవకాశమున్నట్లు ఇంజినీర్లు అంచనా వేస్తున్నారు. అయితే గుత్తేదారు ఒప్పందం ప్రకారం.. పనులు మొదలైన రోజు నుంచి 18 నెలల కాలపరిమితితో ఐడీవోసీ, క్వార్టర్ల నిర్మాణాలను పూర్తి చేయాల్సి ఉంది. ఇప్పటికే 15 నెలలు పూర్తి కావడంతో.. మరో 3 నెలలే మిగిలి ఉంది. కానీ! గడువులోపు పనులు పూర్తయ్యేలా లేవు.

నిధులలేమితో పనుల్లో జాప్యం..

కలెక్టరేట్ భవన నిర్మాణానికి అవసరమైన మట్టి అందుబాటులో లేకపోవడంతో.. సుమారు మూడు నెలల పాటు పనుల్లో జాప్యం జరిగినట్లు తెలుస్తోంది. వర్షాకాలంలో క్వారీల్లో నీరు నిలిచి.. సకాలంలో గనులశాఖ అధికారులు అనుమతి ఇవ్వక పోవడంతో.. పనులు ఆలస్యమైనట్లు అధికారులు చెబుతున్నారు. మరోవైపు రూ.80 కోట్ల అంచనా వ్యయంతో పనులు చేపట్టినప్పటికీ ప్రభుత్వం నుంచి సకాలంలో నిధులు మంజూరు కాకపోవడంతో.. గుత్తేదారు పనులను నెమ్మదిగా చేస్తున్నట్లు సమాచారం. మొదటి విడతలో రూ.20 కోట్లతో పనులు చేపట్టగా.. రూ.10 కోట్ల మేర గుత్తేదారుకు చెల్లించాల్సిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

మరో ఏడాదికాలం పట్టే అవకాశం..

- జితేందర్‌రెడ్డి, ఆర్అండ్‌బీ ఈఈ

సమీకృత కలెక్టరేట్ నిర్మాణాలు పూర్తయ్యేందుకు సుమారు ఏడాది కాలం పట్టే అవకాశముంది. మట్టి అందుబాటులో లేక కొంత కాలం పనులు ఆలస్యమైన విషయం వాస్తవమే. చేసిన పనులకు సంబంధించి గుత్తేదారుకు బిల్లులు సకాలంలో చెల్లిస్తే.. పనుల్లో వేగం పెరిగి నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యే అవకాశముంది.

ఎన్పీడీసీఎల్ సీఎండీ సమీక్ష

బాలసముద్రం, న్యూస్‌టుడే: నక్కలగుట్టలోని ఎన్పీడీసీఎల్ కేంద్ర స్థానం విద్యుత్తు భవన్ నుంచి సోమవారం సంస్థ సీఎండీ వరుణ్‌రెడ్డి అన్ని సర్కిళ్ల ఎస్ఈలు, డీఈ (టెక్నికల్)తో ఆయన వీడియో సమీక్షలో మాట్లాడారు. అన్ని ట్రాన్స్‌ఫార్మర్లపై 1800 425 0028, 1912 టోల్ ఫ్రీ నంబర్లు ముద్రించాలన్నారు. సమస్యల పరిష్కారం కోసం టోల్ ఫ్రీ నంబర్లు వినియోగదారులకు చేరేవిధంగా విస్తృత ప్రచారం చేయాలన్నారు. ప్రమాదాలు సున్నా శాతానికి తేవడానికి పూర్తి స్థాయిలో కృషి చేయాలన్నారు. విద్యుత్తు భవన్ అధికారులు అశోక్ కుమార్, మధుసూదన్, కిషన్, అశోక్, గౌతమ్ రెడ్డి, శ్రీధరాచారి తదితరులున్నారు.



అర్జీలు సత్వరమే పరిష్కరించాలి


అర్జీలను పరిశీలిస్తున్న జిల్లా పాలనాధికారి డా.సత్యశారద

వరంగల్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ప్రజావాణి సందర్భంగా వచ్చే అర్జీలను పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద సంబంధిత అధికారులను ఆదేశించారు. అర్జీలు ఏ దశలో ఉన్నాయో.. ఎప్పటికప్పుడు సమాచారం అందించాలన్నారు. అపరిష్కృత సమస్యలపై దృష్టి సారించాలన్నారు. సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 58 అర్జీలు స్వీకరించినట్లు ఆమె వెల్లడించారు. నెక్కొండ మండలానికి చెందిన బానోతు వీరన్న ధరణి పోర్టల్‌లో భూ సమస్యపై పాలనాధికారిని సంప్రదించగా.. అప్పటికప్పుడే ధరణి ఆపరేటర్ ద్వారా పరిష్కరించారు. అనంతరం జరిగిన సమావేశంలో పత్తి, ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సన్నరకం, దొడ్డురకం ధాన్యాలను కొనుగోలు చేసేందుకు వేర్వేరు కౌంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎంజీఎం, సీకేఎం, ఎనుమాముల మార్కెట్ యార్డుల్లో మహిళా క్యాంటీన్ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. అదనపు పాలనాధికారి సంధ్యారాణి, ఆర్డీఓ కృష్ణవేణి, జడ్పీ సీఈఓ రాంరెడ్డి, డీఆర్డీఓ కౌసల్యాదేవి తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కిట్ సమకూర్చరూ..!


వెన్నముక సమస్య బాధితులు

శాశ్వత వైకల్యంతో బాధపడుతున్న వెన్నముక బాధితుల కోసం యూరిన్ బ్యాగ్స్, కాటన్, బెటడిన్ తదితర వైద్య పరికరాలున్న మెడికల్ కిట్‌ను సమకూర్చాలి. జీవితాంతం ఇతరులపై ఆధారపడి జీవించాల్సిన మా సంరక్షణ కోసం ప్రభుత్వం వైద్య సహాయకులను నియమించాలి. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో తక్షణ వైద్య సాయం పొందేందుకు వీలుగా.. ఆరోగ్య కార్డులను జారీ చేయాలని కలెక్టర్‌ను కోరారు.

నాలుగేళ్లుగా రుణం మంజూరు కాలేదు

- ఎన్.రాజు, రుద్రగూడెం, నల్లబెల్లి మండలం

ఎస్సీ కార్యాచరణ ప్రణాళిక 2020-21 ఏడాదికి ఆర్థిక సహకార పథకం కింద రాయితీ రుణానికి దరఖాస్తు చేసుకున్నాను. జిల్లా కమిటీ ద్వారా ఎంపిక చేసి బ్యాంకులో రుణ ఖాతా తెరవాల్సిందిగా.. సంబంధితశాఖ అధికారులు సూచించారు. ఖాతా తెరచి ఏళ్లు గడుస్తున్నా రుణం మంజూరు కాలేదు.


కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

సమస్యల సంగతి చూడండి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: ప్రజావాణి అర్జీలపై నిర్లక్ష్యం వీడండి.. సమస్యల సంగతి చూడాలని అధికారులను కమిషనర్ డా.అశ్విని తానాజీ కోరారు. సోమవారం బల్దియా సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణిలో 56 అర్జీలు స్వీకరించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి 39, నీటి సరఫరావి 4, ఇంజినీరింగ్ 6, పారిశుద్ధ్యం 5, పన్నుల శాఖవి రెండు ఫిర్యాదులు వచ్చాయని అధికారులు తెలిపారు.

వరంగల్ ప్రాంతం: కొత్తవాడ, తుమ్మలకుంటలో లేఅవుట్ ఖాళీ స్థలానికి రక్షణ కల్పించాలి. ☛ ఖిలావరంగల్ పడమరకోట సర్వే నంబరు 754, 755లో స్థలంలో జరుగుతున్న అక్రమ నిర్మాణాలు ఆపాలి. ☛ పైడిపల్లి గ్రామంలో భవన నిర్మాణ అనుమతులు ఇవ్వడం లేదు. ☛ ఉర్సు దర్గా ప్రాంతం ఇంటి నంబరు 18-4-12 కాలనీలో సీసీ రోడ్డు, డ్రైనేజీ ఏర్పాటు చేయాలి.

లిల్లీ తోట.. లాభాల బాట

ఆదర్శం

లింగాలఘనపురం, న్యూస్‌టుడే: జనగామ జిల్లా లింగాలఘనపురం మండలం పటేలు గూడెం గ్రామానికి చెందిన పెండ్లి ప్రభాకర్ పూల తోటల సాగులో ఆదర్శంగా నిలుస్తున్నారు. బీఈడీ పూర్తి చేసినా.. ఉద్యోగం కంటే వృత్తినే నమ్ముకున్నారు. తల్లి దండ్రులు రమేశ్, అనసూయ చేయూతను అందిస్తుండగా 18 ఏళ్లుగా మల్లెతోట సాగు చేపట్టారు. ఈ ఏడాది 15 గుంటల విస్తీర్ణంలో బంతిపూల సాగు, 30 గుంటల విస్తీర్ణంలో నేలసంపంగి(లిల్లీ పూలు) సాగు చేశారు. పూలు కోతకు వచ్చి లాభాల బాట పట్టారు. ఈ సందర్భంగా 'రైతే రాజు'తో మాట్లాడారు. గత సంవత్సరం జులైలో నేలను గుల్లగా దుక్కి చేశారు. 4 ట్రాక్టర్ల పశువుల ఎరువు చల్లుకున్నారు. అడుగు దూరం, అడుగు వెడల్పుతో బోదెలు చేసుకున్నారు. వికారాబాద్‌లో రైతు వద్ద నుంచి ఒక్కో బ్యాగ్ రూ.వెయ్యి చెల్లించి 20 బ్యాగుల నేలసంపంగి పూల దుంప(గడ్డ)లను కొనుగోలు చేశారు. వాటిని అడుగు దూరంతో నాటుకున్నారు. నెలకో సారి కంపోస్టు, మిశ్రమ ఎరువులు వేస్తున్నారు. రసం పీల్చే పురుగు నివారణకు పురుగు మందులు పిచికారీ చేస్తున్నారు. ఆరు నెలల్లో పూత ప్రారంభమైంది. ఒక్కసారి నాటితే వరసగా మూడేళ్లు పూలు పూస్తుంటాయి. పూలను ఉదయమే కోయాల్సి ఉంటుంది. హైదరాబాద్ వంటి మార్కెట్‌కు తరలించాలంటే మరింత వేకువజామున పూలు కోస్తున్నారు. వ్రతాలు, పండగలు, పెళ్లిళ్ల సీజన్‌లో కిలో రూ.150 వరకు సాధారణంగా కిలో.రూ.120 వరకు ధర లభిస్తుంది. రోజుకు 20 నుంచి 30 కిలోల దిగుబడి వస్తుంది. 6 నెలల్లోనే పెట్టిన పెట్టుబడులు సాధించారు. రోజుకు రూ.1500 వరకు ఆదాయం లభిస్తుంది. పెట్టుబడులు పోగా ఏటా రూ.5 లక్షల వరకు ఆదాయం ఉంటుంది. ఇద్దరు కూలీలు సరిపోతున్నారు. తక్కువ విస్తీర్ణంలో నేలసంపంగి సాగు చేపట్టి ఎక్కువ లాభాలు పొందుతున్నారు.


నేల సంపంగి పూలు చూపుతున్న పెండ్లి ప్రభాకర్

ప్రశ్న- సమాధానం

వరిలో అగ్గి తెగులు సోకింది. నివారణ చర్యలు తెలపండి. –న్యూస్‌టుడే, వరంగల్ వ్యవసాయం

– కె.తిరుపతిరెడ్డి, వంగర, భీమదేవరపల్లి

ట్రైసైక్లోజోల్ 0.6 గ్రాములు లేదా ఐసోప్రోథియోలిన్ 1.5 మి.లీ లేదా కాసుగామైసిన్ 2.5 మి.లీ లేదా ట్రైసైక్లోజోల్, మ్యాంకోజెబ్ మిశ్రమ మందును 2.5 గ్రాములను లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

– డా.దిలీప్‌కుమార్, కోఆర్డినేటర్, వరంగల్ ఏరువాక కేంద్రం



డ్రోన్.. పిచికారీ అదిరెన్


కాకర్లపల్లిలో డ్రోన్‌తో పురుగు మందు పిచికారీ చేస్తున్న అజయ్‌కుమార్‌గౌడ్

రేగొండ, న్యూస్‌టుడే: ఇటీవల చాలా మంది రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో పంటలను సాగు చేస్తున్నారు. నిత్యం మిర్చి, పత్తి వంటి పంటలకు రోజు మార్చి రోజు పురుగు మందులు స్ప్రే చేస్తుంటారు. ఒకటి, రెండు ఎకరాలు పిచికారీ కోసం ఇద్దరు కూలీలు అవసరం ఉంటుంది. రైతుల కష్టాలకు చెక్ పెట్టేలా ఓ ప్రైవేటు కంపెనీ సాయంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం కాకర్లపల్లి గ్రామానికి చెందిన తాళ్లపల్లి అజయ్ కుమార్‌గౌడ్ డ్రోన్ తీసుకొచ్చారు. తక్కువ ఖర్చు, అతి తక్కువ సమయంలో అన్ని రకాల పంటలపై స్ప్రే చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇది పని చేసే విధానాన్ని ఆయన 'రైతేరాజు'కు వివరించారు. సుమారు రూ. 7 లక్షల నుంచి రూ.8 లక్షలతో డ్రోన్ కొనుగోలు చేశారు. బ్యాటరీలను ఒకసారి ఛార్జింగ్ చేస్తే సుమారు 3 ఎకరాల వరకు మందు పిచికారీ చేయవచ్చు. ట్యాంకులో సుమారు 12 లీటర్ల నీటిని, మందును నింపుకునే అవకాశం ఉంటుంది. ఒక్క ఎకరం సుమారు 4 నుంచి 5 నిమిషాల కాలవ్యవధిలో పిచికారీ పూర్తవుతుంది. రోజుకు సుమారు 20 నుంచి 25 ఎకరాలకు మందును స్ప్రే చేయవచ్చు. సాధారణంగా రైతులు ఎకరానికి సుమారు 120 నుంచి 150 లీటర్ల నీటిని ఉపయోగిస్తారు. అదే డ్రోన్‌తో కేవలం 12 లీటర్ల నీరు, తక్కువ మోతాదులో పురుగు మందు కలిపితే చాలు. సాధారణ పద్ధతిలో ఇద్దరు కూలీల ఖర్చులు(రూ.1200 నుంచి రూ.1500), ఒక్క రోజుకు 2 నుంచి 3 ఎకరాలకు తైవాన్ పంపుతో పిచికారీ చేస్తారు. మందు ఎక్కడా నేలపై కాకుండా కేవలం పంట మొక్కలపై పడుతుంది. తక్కువ నీరు, తక్కువ సమయం, తక్కువ మందు, తక్కువ ఖర్చుతో ఎవరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూత, పురుగు మందుల వినియోగం అవుతుందని యువకుడు అజయ్‌కుమార్ గౌడ్ వివరించారు. ప్రస్తుతం ఒక రోజుకు సుమారు రూ.6 వేల నుంచి రూ.8 వేల వరకు ఆదాయం వస్తుందని చెప్పారు.

రైతేరాజు

మిరపలో.. జాగ్రత్తలు పాటిద్దాం..!

ముకోసం

మానుకోట, న్యూస్‌టుడే : ఉమ్మడి వరంగల్ జిల్లాలో పలు ప్రాంతాల్లో మిరప తోటలకు వివిధ రకాల చీడపీడలు ఆశిస్తున్నాయి. ఈ తరుణంలో చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను మల్యాల కేవీకే కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ మాలతి, ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ ఈ.రాంబాబు తెలిపారు.

పైముడత: తామర పురుగులు ఆకుల అడుగు భాగంలో రసం పీల్చడంతో ఆకులు పైకి పడవ ఆకారంలో ముడుచుకుంటాయి. నివారణకు ఒక లీటరు నీటికి ఫిప్రోనిల్ రెండు మి.లీ లేదా డయాఫెంథియురాన్ ఒకటిన్నర గ్రాములు లేదా ఎసిపేట్ ఒకటిన్నర గ్రాములు కలిపి పిచికారీ చేయాలి.

వేరుకుళ్లు: మొక్కల వేర్లు నల్లబారి మొక్కలు చనిపోతాయి. మొదళ్లలో కాపర్ ఆక్సీక్లోరైడ్ 30గ్రాములు+ప్లాంటోమైసిన్ ఒక గ్రాము 10 లీటర్ల నీటికి లేదా లీటరు నీటికి కాపర్ హైడ్రాక్సైడ్ రెండు గ్రాములు లేదా మెటలాక్సిల్ రెండున్నర గ్రాములు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు నుంచి మూడుసార్లు మొక్కల వేర్లు బాగా తడిసేలా పోసుకోవాలి. ట్రైకోడెర్మా విరిడి రెండు కిలోలు+ 90 కిలోలు బాగా చితికిన పశువుల ఎరువుతో కలిపి వారం పది రోజుల పాటు బాగా మగ్గిన తర్వాత తెల్లని బూజు ఏర్పడుతుంది. ఆ మిశ్రమాన్ని మొక్కల మొదళ్లలో వేసుకోవాలి.

● **ఆకుముడత :** ఇది ఆశించిన మొక్కల ఆకులు కుచించుకుపోయి గిడసబారి మొక్క ఎదుగుదల క్షీణిస్తుంది. తెల్లదోమ ద్వారా వ్యాప్తి చెందుతుంది. జిగురు అట్టలు ఎకరాకు 30 నుంచి 40 వేసుకోవాలి. వేపనూనె (1500 పీపీఎం) ఐదు మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి. తెల్లదోమల నివారణకు లీటరు నీటికి ఎసిపేట్ ఒకటిన్నర గ్రాములు లేదా థయోమిథాక్సాం 0.3 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.3 మి.లీ లేదా క్లోరోఫిన్‌ఫైర్ రెండు మి.లీ వంటి మందులను మారుస్తూ పిచికారీ చేయాలి.

● **నల్లతామర :** ఆకుల చిగుర్లు ఎరుపు వర్ణంలోకి మారి మాడిపోయినట్లు కనిపిస్తాయి. నివారణకు జిగురు అట్టలు ఎకరాకు 20 నుంచి 30 ఏర్పాటు చేయాలి. ఫిప్రోనిల్ 80 శాతం 40 గ్రాములు ఎకరాకు లేదా ఫిప్రోనిల్+ ఇమిడాక్లోప్రిడ్ 40 గ్రాములు ఎకరాకు, లేదా సయాంట్రనిలిప్రోల్ 90-100 మి.లీ ఎకరాకు లేదా స్పైనటోరమ్ 180 మి.లీ ఎకరాకు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.


నల్లతామర పురుగులు

ఆశయం ఘనం.. ఆచరణలో విఫలం!

మూతపడిన స్టీల్ బ్యాంకు పథకం

జనగామ, న్యూస్‌టుడే: పర్యావరణానికి మేలు చేయడంతో పాటు, పట్టణ పేద మహిళలకు ఉపాధి మార్గం చూపించే ఆశయంతో ప్రారంభించిన ఓ పథకం మూలకు చేరింది. పట్టణ మహిళల ఆర్థిక ప్రగతికి మెప్మా ఆధ్వర్యంలో వారి సొంత, కొత్త వ్యాపారాలకు రుణాలిస్తున్నారు. ఇటు ఆదాయం, అటు పర్యావరణానికి హితంగా ఉండేలా ప్రారంభించిన 'స్టీల్ బ్యాంకు' పథకం ఉమ్మడి జిల్లాలో ఆచరణలో విఫలమైంది. పట్టణ ప్రాంతాలకు సమస్యగా మారిన ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించేందుకు నిషేధాజ్ఞలు విధించి జరిమానాలు వడ్డిస్తున్నారు. విందులు, ప్రత్యేక సందర్భాల్లో ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసుల వాడకం ద్వారా ఒకసారి వాడి పడేసే ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా పోగవుతున్నాయి. ఈ సమస్యను పరిష్కరించడానికి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) ఆధ్వర్యంలో ఉభయతారకంగా ఉండేలా 'స్టీల్‌బ్యాంకు' పథకాన్ని ప్రవేశపెట్టారు. ప్లాస్టిక్ వస్తువుల స్థానంలోనే గతంలో మాదిరిగా స్టీలు, ఇండాలియం(అల్యూమినియం) గిన్నెలు, కంచాలు, గ్లాసుల వినియోగాన్ని ప్రోత్సహించేందుకు దీనిని ప్రారంభించారు. ఈ పథకం ద్వారా ఒక వేడుకలో 8 కిలోల ప్లాస్టిక్ వాడకం తగ్గుతుందని పరిగనలోకి రావడంతో కేంద్ర, రాష్ట్ర ఆర్థిక సర్వే సంస్థల నుంచి ప్రశంసలు సైతం దక్కాయి.

ఇలా ప్రారంభమైంది..

మహాత్మా గాంధీ జాతీయ నిధి(ఎంజీఎన్‌ఎఫ్) ఆధ్వర్యంలో రాష్ట్రంలో పురపాలికలున్న జిల్లా కేంద్రాల్లో స్టీలు సామగ్రి(స్టీల్ బర్తన్) బ్యాంకులను ఏర్పాటు చేశారు. మొదటి దశలో రూ.1.50 లక్షల నుంచి రూ.1.75 లక్షల వరకు పెట్టుబడిని రుణ రూపేణ సమకూర్చారు.. ఇందులో భాగంగా గత సంవత్సరం జనగామ, మహబూబాబాద్ జిల్లా కేంద్రాల్లోని పురపాలికల్లో ఒక్కొక్కటి, వరంగల్, హనుమకొండ జిల్లాల పరిధిలో మూడు బ్యాంకులను ప్రారంభించారు. నిర్వహణకు ఆసక్తి కలిగిన మహిళా సంఘాలను ఎంపిక చేసి, తక్కువ వడ్డీకి రుణం మంజూరు చేశారు. వసతి సౌకర్యం కల్పించి, కేంద్రం ద్వారా అద్దె ప్రాతిపదికన పాత్రలను స్టీల్ బ్యాంకు ద్వారా అందజేసేలా కార్యాచరణ రూపొందించారు. దశలవారీగా టెంట్లు, కుర్చీలు, బల్లలు ఇతర సామగ్రిని సమకూర్చుకుని వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవచ్చునని సూచించారు.

సహకారం కొరవడి.. రుణం భారమై..

జనగామ పరిధిలో మహమ్మద్ స్లమ్‌లెవల్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నర్మద, రజియాలు 17 రకాల వస్తువులతో స్టీల్ బ్యాంకును సెప్టెంబరు 2023లో ప్రారంభించారు. మున్సిపాలిటీ, ఇతర ప్రభుత్వ శాఖల నుంచి, మెప్మా సంఘాల నుంచి సహకారం అందలేదు. రవాణా, కూలీలకు చెల్లింపులు భారమయ్యాయి. దీంతో ఒకటి రెండు వేడుకలకు మినహా స్టీల్ సామగ్రిని సరఫరా చేయలేకపోయారు. రుణ భారం మీదపడింది. జయశంకర్ భూపాలపల్లిలో కేంద్రాన్ని ప్రారంభించలేదు. మహబూబాబాద్‌లో కొన్నాళ్లపాటు నడిచినా ప్రస్తుతం మనుగడలో లేదు. వరంగల్ కార్పొరేషన్ పరిధిలో కాజీపేట బ్యాంకు సామగ్రిని క్యాంటీన్ నిర్వహణలో వాడుతున్నారు. మరో రెండు చోట్ల ఖాయిలా పడ్డాయి.


జనగామలో ఇలా..

☛ పట్టణ సమాఖ్య నుంచి, రూ.1.50 లక్షలు రుణం తీసుకుని కేంద్రాన్ని ఏర్పాటు చేశాము. ఆశించిన సహకారం లేదు. దీంతో నిర్వహణ భారమైంది. ఆదాయం లేకున్నా, నెలనెలా వడ్డీతో పాటు కిస్తీ చెల్లించాల్సి వస్తోంది. రుణం రద్దు చేసి ఆదుకోవాలని జనగామ స్టీల్‌బ్యాంకు నిర్వాహకురాలు నర్మద తెలిపారు.

☛ ఆశించిన మేర సులభతర సేవలకు అవకాశం లేకపోవడం ఇబ్బందిగా మారింది. ఇతర జిల్లాల్లో మాదిరి ఇక్కడా నిరుపయోగంగా ఉన్న స్టీల్ బ్యాంకు సామగ్రిని మహిళా శక్తి క్యాంటీన్‌కు సరఫరా చేసే అవకాశాన్ని కల్పించాలని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్తామని జనగామ మెప్మా పీడీ హర్షవర్ధన్ వివరించారు.

విదేశానికి వెళ్లే భాగ్యం లేదా?

అంతర్జాతీయ క్రీడా పోటీలకు ఎంపికైన దివ్యాంగురాలు

మహబూబాబాద్, న్యూస్‌టుడే: పుట్టుకతో ఒంటి కాలుతో వచ్చిన వైకల్యంతో ఆమె కుంగిపోలేదు.. ఇరుగుపొరుగువారి సూటిపోటి మాటలే ఆమెలో పట్టుదలను పెంచాయి.. ఏదైనా సాధించాలనే తపన పెంచాయి. అమ్మమ్మ ఇంటివద్ద ఉంటూ చదువుకొంది.. ఏడో తరగతిలో ఉన్నప్పుడు పాఠశాలలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని నిర్వహించారు. అప్పుడే ఆమె దృష్టి క్రీడల వైపు మళ్లించి ప్రతిభ చాటుతోంది. అంతర్జాతీయ పారా త్రోబాల్ పోటీలకు దివ్యాంగుల విభాగంలో ఎంపికై దాతల ఆర్థిక సహకారం ఎదురుచూస్తోంది.

మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గొల్లగూడెనికి చెందిన దయ్యాల కొమరమ్మ-కొమరయ్యల కూతురు భాగ్య తనకున్న వైకల్యాన్ని లెక్కచేయకుండా ట్రై సైక్లింగ్, షార్ట్‌పుట్, చెస్, క్యారమ్స్ పోటీల్లో పాల్గొంటోంది. సీనియర్ క్రీడాకారుడు ప్రశాంత్ అందించిన సహకారంతో దివ్యాంగుల విభాగంలో వివిధ క్రీడల్లో పాల్గొని రాష్ట్రస్థాయిలో రాణిస్తోంది. ఈ ఏడాది డిసెంబర్ 1 నుంచి 5 వ తేదీ వరకు ఇండోనేషియాలో నిర్వహించనున్న అంతర్జాతీయ 'పారా త్రోబాల్ పోటీల్లో పాల్గొనేందుకు దివ్యాంగుల విభాగంలో ఎంపికైంది. పారా త్రోబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా(ఆర్) ఆధ్వర్యంలో సెప్టెంబర్ 21 నుంచి 24 వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలో నిర్వహించిన జాతీయ పోటీల్లో పాల్గొని అంతర్జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారుల్లో తెలంగాణ రాష్ట్రం నుంచి ఆమెకు అవకాశం లభించింది. విదేశాలకు వెళ్లేందుకు అయ్యే సుమారు రూ. 90 వేలు వ్యయం భరించే ఆర్థిక స్థోమత లేక ఆవేదన చెందుతోంది. 2019లో కూడా ఆమె థాయిలాండ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ పారా ఒలింపిక్ పోటీలకు ఆర్థిక స్థోమత లేక వెళ్లలేకపోయింది. మరోసారి అవకాశం వచ్చినా ఆమెకు లక్ష్మీ కటాక్షం కరవైంది. ఈసారి ఎలాగైన ఇండినేషియాలో నిర్వహించే పోటీల్లో పాల్గొనాలనే ఆశతో తనకు ఆర్థిక సహకారం అందించాలంటూ సోమవారం కలెక్టరేట్‌లో విన్నవించారు. జిల్లా క్రీడలు, యువజన శాఖలో బడ్జెట్ లేకపోవడంతో తాము ఆర్థికంగా చేయూతను అందించలేమని, ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామని అధికారులు బదులిచ్చారు. మొదటి విడతగా రూ. 35 వేలు మంగళవారం వరకు, మిగిలిన సొమ్ము నవంబర్ నెల 15 వరకు సమకూరుతేనే వీసా, వసతి సౌకర్యాలు కలుగుతాయని చెబుతూ దాతల సహకారాన్ని ఆశిస్తోంది.


డి. భాగ్య

16, 17న క్రికెట్ ఎంపిక పోటీలు

వరంగల్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: వరంగల్ క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్-23 విభాగంలో ఈ నెల 16, 17 తేదీల్లో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు ఆ సంఘం కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. వరంగల్ మండిబజార్‌లో జరిగిన సమావేశంలో వివరాలు వెల్లడించారు. దేశాయిపేట సీకేఎం కళాశాల మైదానంలో పోటీలు ఉంటాయన్నారు. వరంగల్, హనుమకొండ, ములుగు, భూపాలపల్లి, జనగామ, మహబూబాబాద్ జిల్లా జట్లకు ఎంపిక పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆరు జిల్లాల క్రికెటర్ల ప్రతిభ ఆధారంగా ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన జట్టు ఈ నెల 20 నుంచి 23వరకు వరంగల్ నగరంలో జరిగే ఇంట్రా డిస్ట్రిక్(ఉమ్మడి జిల్లాలు) క్రికెట్ టోర్నీలో పాల్గొంటారని వివరించారు.

చికెన్ ధరలు (కిలో వెల రూపాయలలో) వెన్‌కాబ్		
	ఫాం: 126	డ్రెస్డ్: 215
	రిటైల్: 148	స్కిన్‌లెస్: 244

నేటి నుంచి వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిబిరం

వెంకటాపూర్(ములుగు జిల్లా), న్యూస్‌టుడే: యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఖ్యాతిని ప్రపంచ నలుమూలలా చాటిచెప్పేందుకు ఏటా నిర్వహించే వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిక్షణ శిబిరం-3 మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. యునెస్కో, కేంద్రపురావస్తు, పర్యాటక శాఖలు, ఇంటాక్ భాగస్వామ్యంతో ఈనెల 15 నుంచి 26 వరకు 80 మంది వాలంటీర్లకు శిక్షణ ఇచ్చేందుకు శ్రీకారం చుట్టారు. గుర్తింపు తర్వాత నిర్వహించే మూడో శిబిరంలో రాష్ట్రంలోని టూరిజం క్లబ్‌లకు కూడా ఈ ఏడాది కొత్తగా అవకాశం కల్పించారు. ఏటా డబ్ల్యూహెచ్‌వీ(వరల్డ్ హెరిటేజ్ వాలంటీర్ శిబిరం) నుంచి ఎంపికైన వారికి మాత్రమే తర్ఫీదు ఇచ్చేది. దాంతో ప్రపంచస్థాయిలోనే కాకుండా స్థానికంగా కూడా రామప్ప కీర్తిని మరింత చాటేందుకు అడుగులు పడ్డాయి. కాకతీయ హెరిటేజ్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాట్లను సోమవారం పరిశీలించారు. జిల్లా పాలనాధికారి చేతుల మీదుగా కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 12 రోజుల పాటు వివిధ శాఖల్లో ప్రావీణ్యం కలిగిన ప్రొఫెసర్లతో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు రూపొందించారు.

మే నుంచే దరఖాస్తుల స్వీకరణ : ఈ శిబిరం నిర్వహణకు యునెస్కో మే 2024లోనే ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణకు ప్రకటన వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా స్వదేశీయులతో కలిపి 253 మంది www.unesco.whc.org వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 45 మంది విదేశీయులు ఎంపికయ్యారు. కొన్ని కారణాలతో ఈసారి విదేశీయులెవ్వరూ శిబిరానికి హాజరుకావడం లేదని, ప్రస్తుతం మన దేశంలోని కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి 40 మందిని ఎంపిక చేసినట్లు ఇంటాక్ ప్రతినిధి శ్రీధర్‌రావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. వీరిలో 18 నుంచి 35 ఏళ్లలోపున్న చరిత్ర, కళలు, పురావస్తు, ఆర్కిటెక్చర్, సివిల్ ఇంజినీరు, టూరిజం విభాగాల్లో నైపుణ్యం కలిగిన విద్యార్థులున్నారు.

యువ టూరిజం నుంచి 40 మంది : రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల ప్రాశస్త్యాన్ని మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన టూరిజం క్లబ్‌ల నుంచి రామప్పలో నిర్వహించే ఈ శిబిరానికి ప్రత్యేకంగా యువటూరిజం(ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి) 40 మందిని ఎంపిక చేసింది. రామప్ప ఖ్యాతిని తెలుసుకునేలా రాష్ట్రం నుంచి కూడా చోటు కల్పించాలని యునెస్కోను కోరడంతో స్థానికులకు అవకాశమిచ్చినట్లు పర్యాటకశాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ యూనివర్సిటీల్లో పర్యాటకం, చరిత్ర విద్యనభ్యసిస్తున్న వారే అధికంగా ఉండటం గమనార్హం.

రామప్ప ఆలయం


కిక్కిరిసిన బస్సులు..!

హనుమకొండ చౌరస్తా, న్యూస్‌టుడే: బతుకమ్మ, దసరా వేడుకలు ముగిశాక సొంతూళ్ల నుంచి వారి గమ్యస్థానాలకు బయలుదేరడంతో హనుమకొండ బస్టాండు సోమవారం ప్రయాణికులతో కిటకిటలాడింది. ప్రయాణికులు బస్సుల్లో కిక్కిరిసి ప్రయాణించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 850 ప్రత్యేక బస్సులను నడిపించినా.. ఆది, సోమవారాల్లో ప్రయాణ ప్రాంగణాలు నిండిపోయాయి. హైదరాబాద్ వెళ్లే వారి సంఖ్య భారీగా ఉంది. రద్దీని గమనించిన ఆర్టీసీ అధికారులు బస్టాండులోనే ఉంటూ పర్యవేక్షిస్తూ ప్రత్యేక బస్సులను నడిపించారు. సోమవారం రాత్రి వరకు రద్దీ కొనసాగింది. హైదరాబాద్, బెంగళూరు, విశాఖపట్టణం, గుంటూరు, విజయవాడ, మచిలీపట్టణం, నిజామాబాద్, కరీంనగర్ తదితర ప్రాంతాలకు ఎక్కువగా నడిశాయి. ఉమ్మడి జిల్లాకు హనుమకొండ బస్టాండు ప్రధాన కేంద్రం కావడంతో ఇక్కడే ప్రయాణికుల రద్దీ ఎక్కువగా కనిపించింది. ఆర్టీసీ డీఆర్‌ఎం భానుకిరణ్, వరంగల్ 1, వరంగల్ 2 డిపోల మేనేజర్లు మోహన్‌రావు, జ్యోత్స్న తదితరులు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ.. తగిన విధంగా సేవలందించారు. బస్సులన్నీ రద్దీ మార్గాలకు పంపించడంతో జిల్లాలో రోజువారీ నడిచే బస్సులు లేక ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు.



బస్సు ఎక్కేందుకు పోటీ పడుతూ..


హనుమకొండ బస్టాండులో ప్రయాణికుల రద్దీ

తెరుచుకోని ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలలు



నిరసన వ్యక్తం చేస్తున్న ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ బాధ్యులు

విద్యానగర్, న్యూస్‌టుడే: బోధన రుసుం విడుదల కోరుతూ ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు సోమవారం బంద్ పాటించాయి. దీంతో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని సుమారు 180 ప్రైవేటు కళాశాలలు మూతపడ్డాయి. దసరా సెలవుల తరువాత నిరవధికంగా బంద్ పాటిస్తామని ఇటీవల కేయూ రిజిస్ట్రార్‌కు వినతిపత్రం సమర్పించారు. సోమవారం కళాశాలల బంద్ చేస్తూ హనుమకొండ వాగ్దేవి డిగ్రీ, కళాశాల ముందు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కళాశాలలను బంద్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆదివారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య పి.మల్లారెడ్డి హెచ్చరించినా, యాజమాన్యాలు పట్టించుకోలేదు. కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు పి.ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ సుమారు రూ.300 కోట్లు బోధన రుసుం బకాయిలు రాక నిర్వహణ భారమైనందునే విధిలేక మూసివేత నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. వెంటనే బోధన రుసుం బకాయిలు చెల్లించి విద్యార్థులకు, కళాశాలల యాజమాన్యాలకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ బాధ్యులు ప్రభాకర్ రెడ్డి, వేణుమాధవ్, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో తేలని విద్యార్థుల లెక్క

భూపాలపల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ఒకటి నుంచి ఇంటర్మీడియట్ వరకు విద్యార్థుల సంఖ్య కోసం 2012-13లో యూడైస్ పోర్టల్ (ఏకీకృత జిల్లా విద్యా సమాచారం) ప్రవేశపెట్టింది. దీనిని రెండేళ్ల కిందట యూడైస్ ప్లస్‌గా మార్చారు. అయితే ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తేల్చ లేక విద్యాశాఖ అధికారులు తల పట్టుకుంటున్నారు. ఈ విద్యా సంవత్సరం ప్రవేశాల గడువు ముగిసినా ఇంత వరకు తుది జాబితా కొలిక్కిరాలేదు. అయితే పిల్లలు రోజూ పాఠశాలలకు వస్తున్నారా.. వేరే గ్రామాలు, పట్టణాలకు వలస వెళ్లారా.. తదితర ప్రశ్నలకు సమాధానం దొరకడం లేదు. రెండేళ్ల క్రితం నుంచి యూడైస్ ప్లస్ ద్వారా విద్యార్థుల సమగ్ర సమాచారం పొందుపరుస్తున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఇప్పటి వరకు 50,463 మంది విద్యార్థుల సమాచారం లేదు.

మౌలిక వసతుల కల్పనకు..

బడి ఈడు పిల్లలు చదువుతున్నారా లేక బడి బయట ఉన్నారా.. తదితర విషయాలను యూడైస్ ప్లస్ నివేదిక తెలియజేస్తుంది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ఈ నివేదిక కొలమానం కానుంది. అదే విధంగా ప్రవేశం పొందిన విద్యార్థులకు సంబంధించిన ఆధార్ నంబరు అనుసంధానిస్తున్నారు. దీంతో ఒక విద్యార్థి పేరు రెండు చోట్ల ఉండే అవకాశం లేదు. వివరాలు నమోదు చేయడంలో ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయి. పోర్టల్‌లో నమోదు కాని విద్యార్థుల వివరాలపై ఉన్నతాధికారులు ఆదేశించినా ఫలితం లేదు.

సాంకేతిక సమస్య కారణం..

పాఠశాలల్లో బోగస్ సంఖ్య తప్పించుకునేందుకు కొత్త ఎత్తుగడ వేస్తున్నారు. కొందరికి ఆధార్ కార్డు పొందడం కోసం వేలిముద్రలు పడటం లేదని, మరికొందరు ఉపాధి కోసం వలస వెళ్లి మళ్లీ ఇక్కడే చదువుతున్నారని, ఆధార్ నవీకరణలో సాంకేతిక సమస్యలు ఉన్నాయని, ఇలా వివిధ కారణాలు చెబుతున్నారు. కొన్ని చోట్ల నెలల తరబడి పిల్లలు హాజరు కాకున్నా వారి రిజిస్టర్‌లో నమోదు చేస్తున్నారు. పిల్లల సంఖ్య తగ్గితే అక్కడ నుంచి బదిలీ లేదా డిప్యుటేషన్‌పై వేరే ప్రాంతానికి పంపిస్తారనే ఆరోపణలు సైతం వ్యక్తమవుతున్నాయి. విద్యాశాఖ అధికారులు దృష్టి సారిస్తే బోగస్ సంఖ్య తేలనుంది. పాఠశాలల్లో చేరిన ప్రతి విద్యార్థికి శాశ్వత విద్యా సంఖ్య (పర్మినెంట్ ఎడ్యుకేషన్ నెంబర్) కేటాయించి పోర్టల్‌లో నమోదు చేస్తారు. శాశ్వత సంఖ్య ఆధారంగా ప్రవేశం కల్పిస్తే ఎక్కడ చదువుతున్నారో తెలుస్తుంది.


తరగతి గదిలో విద్యార్థులు

ప్రధానోపాధ్యాయులను ఆదేశించాం

- రాజగోపాల్, విద్యాశాఖ జిల్లా ప్లానింగ్ కో ఆర్డినేటర్

ప్రతి విద్యార్థి పేరుతో పోర్టల్‌లో నమోదు చేస్తున్నాం. జిల్లాలో డ్రాప్ బాక్స్‌లో ఉన్న వివరాలను తొలగించేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాం. తమ పరిధిలోని సంఖ్య తేల్చాలని ఇప్పటికే అన్ని పాఠశాలల హెచ్‌ఎంలను ఆదేశిస్తున్నాం. నిర్లక్ష్యం చేస్తే చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులు స్పందించి లెక్కలు తేల్చాలి.

ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా సేకరించాల్సిన పిల్లల సంఖ్య

భూపాలపల్లి	ములుగు	వరంగల్
4,009	3,228	12,547
జనగామ	హనుమకొండ	మహబూబాబాద్
6,368	15,415	9,028

విదేశాల్లో ఉద్యోగాలకు నమోదు చేసుకోండి

కొత్తవాడ, న్యూస్‌టుడే: విదేశాల్లో ఉద్యోగాల కోసం నమోదు(ఎన్‌రోల్‌మెంట్) ప్రక్రియ చేపడుతున్నట్లు వరంగల్ జిల్లా ఉపాధి కల్పన అధికారి ఉమారాణి తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్), రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగారాల శాఖ సహకారంతో జర్మనీలో వివిధ ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. ఈ నెల 17న ములుగురోడ్డులోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో నమోదు కార్యక్రమం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు 94400 52592 సంప్రదించాలన్నారు.

రూ.10 నాణెం చెల్లుబాటు

కాజీపేట : రిజర్వ్ బ్యాంకు ఉత్తర్వుల ప్రకారం రూ.10 నాణెం చెల్లుబాటు అవుతుందని కెనరా బ్యాంకు ఒక ప్రకటనలో తెలిపింది. నాణెం చెల్లుబాటుపై విస్తృత ప్రచారం జరగాలని సూచించింది. నాణేల స్వీకరణలో విముఖత చూపిస్తున్న వారి అనుమానాలను నివృత్తి చేసి వినియోగంలోకి తెచ్చేలా చూడాలని పేర్కొంది.

బల్దియా కార్యాలయం.. నిర్వహణ అధ్వానం



గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ కార్యాలయం బయట నుంచి చూస్తే పచ్చదనంతో ఆహ్లాదంగా కనిపిస్తోంది. భవనం లోపలికి వెళితే నిర్వహణ అధ్వానంగా ఉంది. మెట్ల వద్ద ఉమ్మిన పాన్ మరకలు, భవనంపై గోడలకు మొక్కలు మొలిచి.. డాబాపై నీళ్లు నిలిచి.. దోమలు వృద్ధి చెందుతున్నాయి. స్లాబు పెచ్చులూడుతోంది. నిత్యం వివిధ పనుల కోసం కార్యాలయానికి వచ్చే ప్రజలు.. నిర్వహణ చూసి అసహనం వ్యక్తం చేస్తున్నారు. – ఈనాడు, హనుమకొండ. న్యూస్‌టుడే కార్పొరేషన్


పైకప్పు పెచ్చులూడుతోంది ఇలా..


భవనంపై నిలిచిన నీరు


నిర్లక్ష్యానికి నిదర్శనంగా పెరిగిన మొక్కలు

పత్తి రైతుల కోసం వాట్సప్ నంబరు

ఈనాడు, వరంగల్

పత్తి రైతుల కోసం మార్కెటింగ్ శాఖ ఈ ఏడాది ఒక వాట్సప్ నెంబరును (88972 81111) అందుబాటులోకి తీసుకొచ్చింది. కొనుగోళ్లు ప్రారంభమైన నేపథ్యంలో ప్రవేశపెట్టిన ఈ వాట్సప్ విధానం వల్ల రైతులకు అనేక ప్రయోజనాలు ఉన్నాయంటున్నారు. ఈ అప్లికేషన్ వల్ల అన్నదాతలు పత్తి పంటతో రోజుల తరబడి సీసీఐ కేంద్రాలైన మిల్లుల వద్ద వేచి చూసే పని ఉండదు. ఏ కేంద్రం వద్ద ఎంత సరకు ఉంది, వేచి చూడాల్సిన సమయం ఎంతసేపు కూడా ముందే తెలుస్తుంది. దీని వల్ల రైతులు తమ దగ్గర్లోని కేంద్రంలో ఎక్కడ వేచి చూసే సమయం తక్కువుంటే అక్కడికి వెళ్లే విధంగా ఈ వాట్సప్ అప్లికేషన్ రూపొందించారు. పైన పేర్కొన్న మొబైల్ నెంబర్‌తో వాట్సప్‌లో రైతులు 'హిచ్' (హాయ్) అని టైప్ చేస్తే వెంటనే 'వన్ సాఫ్ట్ సిస్టమ్ ప్రైవేట్ లిమిటెడ్' పేరుతో అది తెరుచుకుంటుంది. ఇందులో ఇంగ్లిష్, తెలుగు, హిందీ మూడు భాషల్లో కావాల్సిన దాన్ని ఎంపిక చేసుకోవచ్చు. ఉదాహరణకు తెలుగు ఎంపిక చేసుకుంటే 'అర్హత తనిఖీ', 'విక్రయ సమాచారం', 'తక్‌పట్టి వివరాలు', 'కేంద్రంలో వేచి ఉండే సమయం', ఇలా నాలుగు ఐచ్ఛికాలు కనిపిస్తాయి. రైతులు సాగు చేసిన పత్తి వివరాలు, రైతు ఎన్ని క్వింటాళ్ల వరకు విక్రయించుకునేందుకు అర్హత ఉందనేది మొదట కనిపిస్తుంది. ఒకవేళ రైతులు పత్తి విక్రయిస్తే ఎంత సరకు విక్రయించారు, చెల్లింపు డబ్బుల వివరాలు కనిపిస్తాయని మార్కెటింగ్ వర్గాలు తెలిపాయి.



మేమున్నాం.. మీకు తోడుగా

99635 59929, 98484 09191, 99896 42307, 97053 46535 (10 AM TO 1 PM)

శివనగర్, న్యూస్‌టుడే: 36వ డివిజన్ పుప్పాలగుట్ట ఇంటి నెంబరు 16-11-37/5 వద్ద రెండేళ్లుగా కాలువలు శుభ్రం చేయడం లేదు. ఫిర్యాదు చేసినా స్పందించడం లేదు. – పులిచేరు చంద్రశేఖర్, స్థానికులు

సమాధానం: రెండురోజుల్లో శుభ్రం చేయిస్తాం. – భాస్కర్, శానిటరీ సూపర్‌వైజర్

పోచమ్మమైదాన్, న్యూస్‌టుడే: 13వ డివిజన్‌లోని ఎల్బీ నగర్ మెయిన్ పాఠశాల వీధిలో మురుగు కాలువ శుభ్రం చేయడం లేదు. దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నాం. – సయ్యద్ ఫరూఖ్, స్థానికుడు

సమాధానం: పారిశుద్ధ్య సిబ్బందితో కాలువలు తీయిస్తాం. – ధరమ్‌సింగ్, శానిటేషన్ అధికారి

మహనీయుల విగ్రహాల రక్షణకు కమిటీ


నివాళులర్పిస్తున్న బీసీ నాయకులు

దేశాయిపేట, న్యూస్‌టుడే: మహనీయుల విగ్రహాల పరిరక్షణకు ఆర్డినెన్స్, ప్రత్యేక కమిటీని రాష్ట్ర ప్రభుత్వం నియమించాలని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ తెలిపారు. సోమవారం దేశాయిపేటలో మహాత్మా జ్యోతిబా పులే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పులే విగ్రహాన్ని ధ్వంసం చేసిన వ్యక్తులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కలుషిత నీరు.. పట్టింపు కరువు


బల్దియా కౌన్సిల్ హాల్ ముందు ఓఎస్‌నగర్ కాలనీవాసుల నిరసన

రామన్నపేట, న్యూస్‌టుడే: వరంగల్ ప్రాంతం 29వ డివిజన్ ఓఎస్ నగర్, రఘునాథ్ కాలనీ, పాపయ్యపేటలో నెలరోజులుగా గ్రేటర్ వరంగల్ కుళాయిల ద్వారా మురుగు నీరు, కలుషితమైన నీళ్లు వస్తున్నాయని సోమవారం ఆయా కాలనీల ప్రజలు బల్దియా సమావేశ మందిరం ఎదుట నిరసన తెలిపారు. సీపీఎం రామన్నపేట జోన్ కమిటీ ఆధ్వర్యంలో మహిళలు మురికి నీళ్ల సీసాలతో ధర్నా నిర్వహించారు. నెలరోజులుగా కలుషితమైన తాగునీరు సరఫరా అవుతోందని, ఇంజినీర్లకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సింగారపు బాబు ఆరోపించారు. కమిషనర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. సీపీఎం నాయకులు అరూరి కుమార్, శ్రీనివాస్, రంగరాజు తదితరులు పాల్గొన్నారు. కమిషనర్ ఆదేశాలనుసారం సోమవారం మధ్యాహ్నం ఏఈ శ్రీకాంత్, ఇతర సిబ్బంది కాలనీలో తాగునీటి పరీక్షలు నిర్వహించారు.

30న నరకాసుర వధకు ఏర్పాట్లు చేస్తాం

కరీమాబాద్, న్యూస్‌టుడే: దీపావళి పర్వదినం సందర్భంగా ఈ నెల 30న ఉర్సుగుట్టలోని మైదానంలో నిర్వహించే నరకాసుర వధ ఉత్సవాలకు అన్నిరకాల సదుపాయాలు కల్పిస్తామని జిల్లా పాలనాధికారి డా.సత్యశారద పేర్కొన్నారు. సోమవారం ఉర్సు నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మరుపల్ల రవి ఆధ్వర్యంలో కమిటీ సభ్యులు జిల్లా పాలనాధికారి డా.సత్యశారదను కలిసి వినతిపత్రం అందజేశారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి తోపుచర్ల శ్యామలరావు, సహాయ కార్యదర్శి ఒద్దునూరి రామ్మూర్తి, సంయుక్త కార్యదర్శి వనం కుమార్, సభ్యులు దూడ కొమురెల్లి, అన్న కుమారస్వామి, తోటం రమేష్, నరసింహగౌడ్, రామ్ ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కార్పొరేషన్, న్యూస్‌టుడే: వరంగల్ మహా నగరపాలక సంస్థ ఒప్పంద కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ మున్సిపల్ ఉద్యోగ, కార్మిక సంఘం నాయకులు(సీఐటీయూ), ప్రతినిధులు సోమవారం రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకులు వీపీ గౌతమ్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చారు. 14 సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కోరారు.

'వర్గ విభేదాలతో కాంగ్రెస్ పార్టీకి నష్టం'


గీసుకొండలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

గీసుకొండ, న్యూస్‌టుడే: వర్గ విభేదాలతో కాంగ్రెస్ పార్టీకి నష్టం కలగడమే కాకుండా భారాస బలోపేతమవుతుందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గీసుకొండ మండలం ధర్మారంలో మంత్రి కొండా సురేఖ, ఎమ్మెల్యే రేవూరి వర్గీయుల మధ్య జరిగిన వివాదం నేపథ్యంలో సోమవారం గీసుకొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రేవూరి వర్గీయులు మాట్లాడారు. అందరూ కలిసికట్టుగా పార్టీ పటిష్టత కోసం పని చేయాలన్నారు. సమావేశంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సొజ్జు, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి సీహెచ్. కొమురారెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, నాయకులు రాజ్‌కుమార్, రమేష్, సంతోష్, రుద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంగెం : గీసుకొండ మండలంలోని ధర్మారంలో దసరా పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీల వివాదంలో దేవాదాయ, పర్యావరణ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ జోక్యం చేసుకోవడాన్ని ఖండిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధి జనగాం రమేశ్ అన్నారు. సంగెంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రమేశ్ మాట్లాడారు.

నాణ్యమైన చేప పిల్లలు అందించండి


చేపపిల్లలను చూపుతున్న మత్స్యకారులు

వర్ధన్నపేట, న్యూస్‌టుడే: నాణ్యమైన చేప పిల్లలు అందించడం లేదని మత్స్యకారులు ఆందోళనకు దిగారు. ఈ ఘటన సోమవారం వర్ధన్నపేటలో జరిగింది. వర్ధన్నపేట, పర్వతగిరి, రాయపర్తి మండలాలకు చెందిన మత్స్యకార సంఘాల ప్రతినిధులను గుత్తేదారు సోమవారం వర్ధన్నపేట మండలం కొత్తపల్లిలోని చేపపిల్లల కేంద్రానికి పిలిపించారు. చేప పిల్లలను తీసుకొని వెళ్లడానికి వచ్చిన ఆయా గ్రామాల మత్స్యకారులు వాటిని పరిశీలించగా.. తక్కువ పరిమాణంలో ఉండటంతో గుత్తేదారును నిలదీశారు. ఇప్పటికే చేప పిల్లల పంపిణీ ఆలస్యమైందని, గతంలో ఇచ్చిన సంఖ్య కంటే తక్కువగా ఇస్తుండటంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. నాణ్యమైన చేప పిల్లలను ఇవ్వాలని, లేదంటే నగదు బదిలీ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నాణ్యమైనవి ఇస్తేనే తీసుకుంటామని చెప్పి, అక్కడి నుంచి వెనుతిరిగారు. మత్స్యకార సంఘం నేతలు చొప్పరి సోమయ్య, నర్సయ్య, సుధాకర్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగంగా పూర్తి చేయాలి

ఖిలావరంగల్, న్యూస్‌టుడే: ఖిలావరంగల్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను కుడా(కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ) ఛైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ సోమవారం సందర్శించారు. మధ్యకోట ఏకశిలా చిల్డ్రన్స్ పార్కులోని గుండు చెరువు చుట్టూ జరుగుతున్న బండ్ అభివృద్ధి పనులను పరిశీలించారు. గతంలో చేపట్టిన పనులతో పాటు చేయాల్సిన వాటిని కుడా అధికారులు అజిత్‌రెడ్డి, భీమ్‌రావ్‌తో చర్చించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. కావాల్సిన నిధుల విడుదల కోసం కృషి చేస్తామన్నారు.

చెక్‌డ్యామ్ కట్ట నుంచి లీకేజీ



వర్ధన్నపేట-ఇల్లంద గ్రామాల మధ్య ఆకేరు వాగు చెక్‌డ్యామ్ కోతకు గురైన ప్రాంతంలో ఇటీవల తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన విషయం తెలిసిందే. దీంతో చెక్‌డ్యామ్‌లో నీరు నిలిచి మత్తడిపోస్తోంది. అంతా సవ్యంగా ఉందనుకున్న సమయంలో మూడురోజులుగా తాత్కాలిక కట్ట కింద భాగంలో నీరు లీకవుతుండటం.. ఆందోళన కలిగిస్తోంది. కట్ట పూర్తిగా బలహీన పడకముందే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి లీకేజీని అరికట్టాలని రైతులు కోరుతున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు చేయించి శాశ్వత పనులు చేపట్టే విధంగా ఎమ్మెల్యే కృషి చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, వర్ధన్నపేట

చిరు వ్యాపారులకు అండగా 'నెక్'


ఓసిటీలో ఎగ్‌కార్ట్స్ పంపిణీ చేస్తున్న ఎర్రబెల్లి ప్రదీప్‌రావు

లేబర్‌కాలనీ, న్యూస్‌టుడే: చిరు వ్యాపారులకు, హోటల్ నిర్వాహకులకు జాతీయ కోడి గుడ్ల సమన్వయ కమిటీ(నెక్) అండగా ఉంటుందని నెక్ జోనల్ ఛైర్మన్, వరంగల్ అర్బన్ బ్యాంకు ఛైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. వరంగల్ ఓసిటీలోని కార్యాలయంలో సోమవారం నెక్ ఆధ్వర్యంలో హోటల్ నిర్వాహకులకు ఎగ్‌కార్ట్స్ పంపిణీ కార్యక్రమానికి ప్రదీప్‌రావు ముఖ్య అతిథిగా హాజరై 50 మంది చిరువ్యాపార లబ్ధిదారులకు వాటిని అందించారు.

పీడీఎస్‌యూ స్తూపానికి భూమిపూజ

ఖిలావరంగల్: ఖిలావరంగల్‌లో పీడీఎస్‌యూ స్తూపానికి భూమిపూజ చేశారు. సోమవారం పీడీఎస్‌యూ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పీడీఎస్‌యూ ఏర్పడి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా పిడికిలి బిగించిన స్తూపాన్ని మధ్యకోట చమన్ కూడలిలో నిర్మించనున్నారు. పూర్వ విద్యార్థులను ఐక్యం చేసి ఈ నెల 27న బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యతోనే ఉన్నత పదవులు


ప్రతిభా పురస్కారం అందిస్తున్న కందకట్ల స్వామి

కొత్తవాడ, న్యూస్‌టుడే: విద్యతోనే జీవితంలో ఉన్నత పదవులు అందుతాయని అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందకట్ల స్వామి తెలిపారు. సోమవారం కొత్తవాడలోని పద్మశాలి భవన్‌లో విద్యార్థులకు 'పోపా' ప్రతిభా పురస్కారాలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో పద్మశాలీలు మెజారిటీ వాటా కలిగి ఉన్నారన్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజికంగా ఎదగాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు శామంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు లక్ష్యంతో చదవాలని, ప్రతిభ ఉన్న పద్మశాలి విద్యార్థులకు పోపా(పద్మశాలి అఫిషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్) అండగా ఉంటుందన్నారు. నాయకులు మురళి, కామేశ్వర్, సుధాకర్, ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

'గురుకుల విద్యాలయాలకు తాళం వేస్తాం'

కరీమాబాద్, న్యూస్‌టుడే: తమకు రావాల్సిన అద్దె భవనాల బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినా స్పందించనందున ఈ నెల 15న గురుకుల భవనాలకు తాళాలు వేయనున్నట్లు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల విద్యాలయ ప్రైవేటు భవన యాజమాన్య సంఘం రాష్ట్ర కార్యదర్శి బండి కుమారస్వామి తెలిపారు. గత నెల 20న బకాయిల చెల్లించాలని మహాత్మా జ్యోతిబా పులే తెలంగాణ బీసీ వెల్ఫేర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశామన్నారు. గత నెల 30లోగా తమకు రావాల్సిన బకాయిలు, ఇతర సమస్యలు పరిష్కరించనట్లయితే దసరా సెలవుల నుంచి భవనాలకు తాళాలు వేసి, సమస్యలు పరిష్కారమైన తర్వాతే తిరిగి భవనాలు అప్పగిస్తామన్నారు. ప్రభుత్వం ఇప్పటికీ స్పందించనందున మంగళవారం రాష్ట్ర వ్యాప్తంగా అద్దె భవనాల్లో నడుస్తున్న గురుకులాలకు తాళాలు వేయనున్నట్లు వివరించారు. మంగళవారం ఉర్సుగుట్ట డీకే నగర్ పక్కనున్న మహాత్మా జ్యోతిబా పులే గురుకుల భవనానికి తాళం వేయనున్నట్లు కుమారస్వామి తెలిపారు.

ఉరేసుకున్న బాధితుడికి ఊపిరిపోసిన 108 సిబ్బంది

ఎంజీఎం ఆసుపత్రి, న్యూస్‌టుడే: ఉరేసుకొని అపస్మారక స్థితికి వెళ్లిన బాధితుడికి 108 సిబ్బంది సకాలంలో స్పందించి ఊపిరిపోశారు. ఈ ఘటన సోమవారం వరంగల్ కాశీబుగ్గలో జరిగింది. 108 ఈఎంటీ శ్రీకాంత్, పైలెట్ సాంబయ్య తెలిపిన ప్రకారం.. కాశీబుగ్గ మదీనా వీధికి చెందిన బూర సామ్రాట్(37) మానసిక సమస్యతో సోమవారం తన ఇంట్లో చున్నీతో ఉరేసుకున్నాడు. ఇంటి పక్కనున్న వారు గమనించి వెంటనే 108కి సమాచారం ఇచ్చారు. స్పందించిన 108 ఈఎంటీ శ్రీకాంత్ ఘటనా స్థలానికి వెళ్లారు. అప్పటికే అపస్మారక స్థితిలో ఉన్న బాధితుడికి వైద్యుల సూచనల మేరకు సీపీఆర్ చేశారు. గుండె స్పందించడంతో వెంటనే అంబులెన్సులో ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాధితుడు సామ్రాట్ ఎంజీఎంలో చికిత్స పొందుతున్నాడు. సకాలంలో స్పందించి.. ప్రాణాలు కాపాడిన 108 సిబ్బందిని స్థానికులు అభినందించారు.

వివాహిత ఆత్మహత్య

నల్లబెల్లి, న్యూస్‌టుడే: కడుపునొప్పి భరించలేక వివాహిత గాదం మంజుల(30) ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నల్లబెల్లి మండలం లెంకాలపల్లికి చెందిన మంజుల కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధ పడుతోంది. ఈనెల 13న ఇంట్లో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు ఆమెను నర్సంపేటలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. మృతురాలి సోదరుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రశాంత్‌బాబు తెలిపారు.

వ్యవసాయ బావిలో పడి మహిళ మృతి


అనిత(పాత చిత్రం)

సంగెం, న్యూస్‌టుడే: మానసిక స్థితి సరిగ్గాలేని మహిళ వ్యవసాయ బావిలో పడి మృతి చెందిన సంఘటన సోమవారం సంగెం మండలం కాట్రపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. దుగ్గొండి మండలం తిమ్మంపేట్‌కు చెందిన ఉండ్రాతి అనిత(35) పదేళ్లుగా మానసిక సమస్యతో బాధ పడుతోంది. దసరా పండగ సందర్భంగా కాట్రపల్లిలోని పుట్టింటికి వచ్చింది. ఆమె ఆదివారం రాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు సోమవారం ఉదయం సమీపంలోని వ్యవసాయ బావిలో ఆమె మృతదేహాన్ని గుర్తించి వెలికితీశారు. మృతురాలి తండ్రి పల్లకొండ పాపయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నూనెగింజల పంటలపై దృష్టి సారించండి


విత్తనాలు పొందిన రైతులతో డా.రాజన్న, శాస్త్రవేత్తలు

మామునూరు, న్యూస్‌టుడే: నూనెగింజల పంటలను సాగు చేయాలని ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా.రాజన్న రైతులకు సూచించారు. సోమవారం మామునూరు కృషి విజ్ఞాన కేంద్రంలో సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శనలో భాగంగా యాసంగిలో సాగు చేసే వేరుసెనగ పంటల్లో చీడపీడలపైన రైతులకు శిక్షణ నిర్వహించారు. నూనెగింజ పంటలో సుస్థిరత సాధించాలని సూచించారు. తెలంగాణలో సుమారుగా 1.6 నుంచి 1.7 లక్షల హెక్టార్లలో నూనెగింజ పంట సాగవుతోందన్నారు. శిక్షణ పొందిన రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. శాస్త్రవేత్తలు డా.సౌమ్య, సాయికిరణ్, గణేష్, శశాంక్, హర్ష, సాయిచంద్ ఉన్నారు.

పోలీస్ విధులకు యువకుల ఆటంకం

రంగశాయిపేట, న్యూస్‌టుడే: యువకులు తమ విధులకు ఆటంకం కలిగించారని ఆరోపిస్తూ.. కానిస్టేబుళ్లు మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆదివారం రాత్రి కానిస్టేబుళ్లు ప్రవీణ్‌రెడ్డి, చిరంజీవి కరీమాబాద్‌లో ద్విచక్ర వాహనంపై పెట్రోలింగ్ చేస్తున్నారు. అర్ధరాత్రి దాటిన తర్వాత దుర్గామాత నిమజ్జన ఊరేగింపులో మితిమీరిన శబ్దంతో డీజే పెట్టిన యువకులను కానిస్టేబుళ్లు వారించగా.. మద్యంమత్తులో ఎదురుతిరిగిన యువకులు పెట్రోలింగ్ చేస్తున్న ద్విచక్ర వాహనం తాళం చెవి తీసుకున్నారు. దీంతో పాటు వీడియో తీస్తూ.. హేళనగా మాట్లాడుతూ దాడి చేసేందుకు ప్రయత్నించారన్నారు. ఈ నేపథ్యంలో కానిస్టేబుళ్లు ఉన్నతాధికారులకు సమాచారం అందించడమే కాకుండా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

నర్సంపేట నియోజకవర్గం

వైభవంగా దుర్గాదేవి నిమజ్జనోత్సవం



నర్సంపేట, న్యూస్‌టుడే: నర్సంపేటలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో సోమవారం దుర్గాదేవి నిమజ్జనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారి విగ్రహాన్ని వాహనంలో ఉంచి మేళ తాళాలు, కోలాటం మధ్య పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు ఎ.కృష్ణమూర్తి, ఎన్.కృష్ణమూర్తి, వి.గోవర్ధన్, పి.రమేశ్, వి.రాజు, బి.విజయ్, సంఘం నాయకులు పాల్గొన్నారు.

సాయిబాబా మృతి ఉద్యమాలకు తీరనిలోటు


నర్సంపేటలో కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

నర్సంపేట, న్యూస్‌టుడే: ప్రొఫెసర్ సాయిబాబా మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటని తెలంగాణ ప్రజాఫ్రంట్ (టీపీఎఫ్) జిల్లా అధ్యక్షుడు జనగం కుమారస్వామి అన్నారు. సాయిబాబా మృతికి సంతాపంగా సోమవారం రాత్రి టీపీఎఫ్, వివిధ పార్టీలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో స్థానిక అమరవీరుల స్తూపం వద్ద సాయిబాబా చిత్రపటానికి నివాళులర్పించారు. అంతకుముందు కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకుడు మహబూబ్‌అలీ, సీపీఐ నాయకులు గోవర్ధన్, తెజస నాయకుడు జావెద్, డీటీఎఫ్ బాధ్యుడు వెంకటేశ్వర్లు, జి.శ్రీనివాస్, కె.కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న రవి

నర్సంపేట, న్యూస్‌టుడే: వామపక్ష సామాజిక ఉద్యమాల బలోపేతానికి పార్టీ శ్రేణులు కృషి చేయాలని ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి అన్నారు. స్థానిక ఓంకార్ భవన్‌లో సోమవారం జరిగిన పార్టీ జిల్లా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజ్యాంగ రక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం దోపిడీ విధానాలను నిరసిస్తూ సంఘటితంగా ముందుకు సాగాలన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి పి.రమేశ్ మాట్లాడారు. సమావేశంలో పార్టీ నాయకులు జి.కుమారస్వామి, ఎం.రవి, ఎన్.కొమురయ్య, కె.బాబురావు, రాజాసాహెబ్, సదానందం తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



బానోజిపేట(నర్సంపేట గ్రామీణం), న్యూస్‌టుడే: నర్సంపేట మండలం బానోజిపేటలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో సోమవారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. 2007-08లో పదో తరగతి చదివిన విద్యార్థులు సమావేశమయ్యారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాడు వారికి పాఠాలు బోధించిన ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో నాటి ఉపాధ్యాయులు యాకయ్య, రాంరెడ్డి, మస్తాన్, కుమారస్వామి, అశోక్, సోమయ్య, పూర్వ విద్యార్థులు రాజేందర్, అలీ, అనిల్, సుమన్, నాగరాజు, ఎం.అనిల్, రాజు, మానస, నవత, సునీత పాల్గొన్నారు.

అధికారి అక్రమాలపై సర్కార్‌కు నివేదిక?

నర్సంపేట: నర్సంపేట మున్సిపల్ కార్యాలయంలో ఓ అధికారి అక్రమాలపై నిఘా అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపించినట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల సమాచారం మేరకు.. ప్రభుత్వ ఉద్యోగిగా ఈ పురపాలక సంఘంలో తొలి పోస్టింగ్ కావడం విశేషం. అత్యంత కీలక శాఖలో పని చేస్తున్న సదరు అధికారి.. నిధుల మంజూరు, బిల్లుల విడుదల, ఉద్యోగుల వేతనాలతో పాటు నగదు లావాదేవీలకు సంబంధించి అవినీతికి పాల్పడుతున్నట్లు నిఘా అధికారులు నివేదించారు. ఆయన ప్రతి విషయంలో చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలున్నాయి. ఉద్యోగుల వేతనాల చెల్లింపుల్లో, గుత్తేదారులకు బిల్లుల చెల్లింపుల్లో, వాహనాల డీజిల్ వినియోగం, కార్యాలయానికి సంబంధించిన వివిధ బిల్లుల్లో, పట్టణ ప్రగతి నిధుల్లో అక్రమాలకు పాల్పడ్డాడని అధికారులు ప్రభుత్వానికి నివేదించినట్లు తెలిసింది. అధికారి తీరుతో తాము ఇబ్బంది పడుతున్నామని కింది స్థాయి ఉద్యోగి ఒకరు వాపోయారు.

జిల్లా ఆసుపత్రిలో వైద్యసేవలు ప్రారంభం

నర్సంపేట: నర్సంపేటలోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో సోమవారం బయటి రోగులకు వైద్యసేవలు ప్రారంభమయ్యాయి. పది విభాగాలకు చెందిన వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ప్రతి రోజూ ఉదయం నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఓపీ సేవలు అందుబాటులో ఉంటాయని వైద్య కళాశాల ప్రిన్సిపల్ మోహన్‌దాస్ తెలిపారు. మొదటి రోజు జనరల్, జనరల్ సర్జరీ, ఆప్తాల్మిక్, దంత, ఈఎన్‌టీ, ఫిజియాట్రీ, డెర్మో, సెంట్రల్ ల్యాబ్, ఈసీజీ, డ్రెస్సింగ్ విభాగాల్లో ఓపీ రోగులకు సేవలందించినట్లు ప్రిన్సిపల్ వెల్లడించారు.

సామ్రాజ్యవాద సంస్కృతిని తిప్పికొడదాం

నర్సంపేట: ప్రజల సంస్కృతిని, సాహిత్యాన్ని అభివృద్ధి చేయకుండా పాలకులు సామ్రాజ్యవాద సంస్కృతిని, సాహిత్యాన్ని విద్యార్థులపై బలవంతంగా రుద్దుతున్నారని తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగదీశ్వర్ అన్నారు. నర్సంపేటలో సోమవారం జరిగిన అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 20న నర్సంపేటలో జరగనున్న అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలన్నారు. కళాకారులు, ప్రజా సంఘాల నాయకులతో కలిసి గోడ పత్రికలను ఆవిష్కరించారు. సమావేశంలో ఆయా సంఘాల నాయకులు సోల్తి సారయ్య, ఎస్.మల్లేశం, సాయికుమార్, సారంగపాణి, పూలక్క, సాంబయ్య పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు..

రంగశాయిపేట, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలు ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతిచెందారు. ఈ నెల 12న కొత్తవాడకు చెందిన ఎండీ.మున్నా(52) కుటుంబ సభ్యులతో కలిసి ఆటోలో ఏసీరెడ్డి నగర్‌లోని బంధువుల ఇంటికి వెళ్లి వస్తుండగా.. వెంకట్రామ కూడలిలో గుర్తు తెలియని కారు ఢీకొట్టింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న కుటుంబ సభ్యులకు స్వల్పంగా, మున్నాకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా.. సోమవారం మరణించారు. కుమారుడు అబ్జల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకటరత్నం తెలిపారు.

దాడి ఘటనలో నలుగురిపై కేసు

గీసుకొండ, న్యూస్‌టుడే: గీసుకొండ మండలం ధర్మారంలో పోలీస్ హెడ్‌కానిస్టేబుల్ బొల్లం భిక్షపతిపై దాడి చేసి గాయపరిచిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మహేందర్ తెలిపారు. ధర్మారంలో ఆదివారం రాత్రి నిర్వహించిన దుర్గాదేవి ఉత్సవాల్లో భిక్షపతి విధులు నిర్వహిస్తుండగా ఇదే గ్రామానికి చెందిన బొలిశెట్టి అనిల్, మరో ముగ్గురు వ్యక్తులు మద్యం మత్తులో ఆయనపై దాడికి పాల్పడ్డారు. వారిపై సోమవారం పోలీసులు కేసు నమోదు చేశారు. అనిల్‌ను అదుపులోకి తీసుకోగా మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

జూదరులపై..

ఖానాపురం, న్యూస్‌టుడే: మనుబోతులగడ్డ సమీపంలోని అటవీప్రాంతంలో జూద శిబిరంపై దాడి చేసి నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై రఘుపతి సోమవారం తెలిపారు. మనుబోతులగడ్డకు చెందిన గుర్రం సదయ్య, వల్లెపు చంద్రయ్య, బీసు రవి, షేక్ జాఫర్‌లపై కేసు నమోదు చేసి వారి వద్ద రూ.7,650 నగదును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.